


# || శ్రీ పుష్పదంతాచార్య విరచిత శివమహిమ్నః స్తోత్రం ||

# శ్రీ శివ మహిమ్న స్తోత్రం- శ్రీ పుష్పదంతాచార్యుల చరిత్ర

పుష్పదంతుడొక గంధర్వరాజు. అతడు ప్రతినిత్యము అనేక సుందరమైన పుష్పములతో శివుని పూజించుచుండెడివాడు. పరమేశ్వరుని అనేక రకములైన సుగంధ భరితమైన పూలతో పూజించవలెననే కోరిక ఆయనకొక వ్యసనముగా మారినది. (వ్యసనమనగా చేసిన పనే మళ్ళీ మళ్ళీ చేయడమే గాని చెడు అర్ధం కాదు) తన ఉద్యానవనములోని  పుష్పములతో తృప్తి చెందక తన గంధర్వ శక్తిచే రాత్రి సమయమున అదృశ్యరూపుడై పూవులను దొంగలించి తీసుకొని వచ్చుట ప్రారంభించెను.

భూలోకమున అత్యంత సుందరమైన ప్రదేశము కాశ్మీరము; ఆ దేశపు రాజు కూడా పరమ శివభక్తుడు. శివుని అత్యంత సుందరమైన సుగంధ భరితమైన పుష్పములతో పూజించాలనే కోరికతో తన ఉద్యానవనములో అనేక పూల మొక్కలను వేయించాడు. ఈ పుష్పదంతుడు రాత్రి సమయమున ఆ పూవులన్నింటిని దొంగిలించుట ప్రారంభించెను. ఆ రాజు ఎన్ని ప్రయత్నములు చేసినను ఈ చౌర్యమును నిలువరించలేక పోయెను. చివరకు ఒక శివజ్ఞానసంపన్నుని సూచనమేరకు 'శివనిర్మాల్యము'ను ఆ ఉద్యానవనం నాలుగు వైపులా చల్లించెను. ఈ విషయము నెరుగని పుష్పదంతుడు ఆకాశ మార్గమున శివనిర్మాల్యమును దాటి తోటలో ప్రవేశించెను. ఈ అపరాధ ప్రభావము చేత తన గంధర్వ శక్తులన్నియు నిర్వీర్యము కాగా రాజభటుల చేత నిర్బంధించబడి కారాగారము చేరెను. కారాగారములో నున్న పుష్పదంతుడు ఈ స్తోత్రము చేసి శివుని మెప్పించి ఆయన కటాక్షమునకు పాత్రుడై తిరిగి గంధర్వ లోకమునకేగును. శ్రీ ఆది శంకరాచార్యుల వారు రచించిన "శివానందలహరి" కి స్ఫూర్తి  ఈ స్తోత్రమే. శ్రీ రామకృష్ణ పరమహంస ప్రతినిత్యం పారాయణ చేసిన సోత్రం కూడా ఇదే.

ఒకప్పుడు వివేకానంద 11-9-1893 చికాగో నగరంలో జరిగిన ప్రపంచ సర్వమత సమ్మేళనంలో ప్రస్తావించిన "త్రయీసాంఖ్యంయోగః" అనే శ్లోకం ఈ సోత్రములోనిదే. దేవతా సార్వభౌముడైన ఆ మహాదేవునికి అత్యంత ప్రీతి పాత్రమైన సోత్రం కూడా ఇదే. కేదారం, ఉజ్జయిని మొదలగు క్షేత్రములలో స్వామివారికి అభిషేకం ఈ స్తోత్రంతో చేస్తారు. కాశీలోని పుష్పదంతేశ్వరాలయం ఈ భక్తుని పేరుపై వెలసినదే. ఎంతో మహిమాన్విత స్తోత్రముగా కీర్తించబడే స్తోత్రమును అందరూ నిత్యం పఠించి పారాయణ చేసి ఆ మహాదేవుని కృపకు పాత్రులు కాగలరని ప్రార్ధన.

## || అథ: శ్రీ శివమహిమ్నస్తోత్రమ్ ||

మహిమ్నః పారం తే పరమవిదుషో యద్యసదృశీ

స్తుతిర్బ్రహ్మాదీనామపి తదవ సన్నా స్త్వయి గిరః |

అథాఽవాచ్యః సర్వః స్వమతి పరిణామా వధి గృణన్

మమాప్యేష స్తోత్రే హర నిరపవాదః పరికరః || 1 ||

ఓ శివా! అపారమైన నీ మహిమ తెలియజాలనట్టి నావంటి మూర్ఖుని ఈ నీ స్తుతి అయోగ్యమైనదిగా నీవు భావిస్తే, బ్రహ్మాదులచే చేయబడుతున్న స్తుతులు కూడా అయోగ్యములే అవుతాయి గదా! ఎందుకంటే వారికి కూడా నీ మహిమ అగమ్యము కనుక; ఇక తమ తమ బుద్ధి శక్త్యానుసారము , శ్రద్ధాభక్తులతో రచింపబడిన ఇతరుల స్తుతులు అన్నీ దోషరహితములే అయితే, ఈ నా స్తోత్ర రచనా ప్రయత్నము కూడా దోషరహితమే అవుతుంది.



అతీతః పన్థానం తవచ మహిమా వాఙ్మనసయోః

అతద్వ్యా వృత్త్యాయం చకిత మభిధత్తే శ్రుతిరపి |

స కస్య స్తోతవ్యః కతి విధగుణః కస్య విషయః

పదే త్వర్వాచీనే పతతి నమనః కస్య నవచః || 2 ||

నీ మహిమ మనోవాక్కులకు అతీతమైనది వేదములు కూడా ఏ తత్త్వమును భయముతో "ఇది కాదు, ఇది కాదు" (నేతి నేతి) అని మాత్రమే వర్ణిస్తున్నాయో , అటువంటి నిన్ను ఎవరు స్తుతించగలరు? నీ అశేష దైవీ గుణాలను ఎవరు గణించగలరు? జ్ఞాతవైన నిన్ను ఎవరు

తెలుసుకోగలరు? అయినను భక్తులను అనుగ్రహించుట కొరకు, వారికి సులభముగా లభ్యుడవగుటకు నీవు సాకారుడవైనప్పుడు, ఎవరి మనో వాక్కులు మాత్రం నీ స్తుతీ ప్రవంతిగా పరిణమించకుండా ఉండగలవు?

మధుస్ఫీతా వాచః పరమ మమృతం నిర్మితవతః
తవ బ్రహ్మన్ కిం వాగపి సురగురోర్ విస్మయపదమ్ |
మమ త్వేతాం వాణీం గుణకథనపుణ్యేన భవతః
పునామీత్యర్థేఽస్మిన్ పురమథన బుద్ధిర్వ్యవసితా || 3 ||

ఓ బ్రహ్మన్! అమృతోపమానమైన, తేనెవలే తీయనివైన వేదవాక్కులను రచించే బృహస్పతి యొక్క స్తోత్ర వచనములు కూడా నీకు ఆశ్చర్యము కలిగింపజాలవు కదా! ఓ త్రిపుర నాశకా! నీ మహిమలను స్తుతించుట ద్వారా నా వాక్కులను పవిత్రం చేసుకోవాలనే ఆలోచన నన్ను ఈ స్తోత్ర రచనకు పురిగొల్పింది.



తవైశ్వర్యం యత్తత్ జగదుదయ రక్షా ప్రళయకృత్
త్రయీవస్తు వ్యస్తం తిస్రుషు గుణభిన్నాసు తనుషు |
అభవ్యానామస్మిన్ వరద రమణీయామ రమణీం
విహన్తుం వ్యాక్రోశీం విదధత ఇహైకే జడధియః || 4 ||

ఓ వరదా! అనూహ్యమైన నీ శక్తి రజస్సు, సత్వము, తమస్సు అనే మూడు గుణములతో బ్రహ్మ-విష్ణు-మహేశులనే మూడు రూపములను ధరించి జగత్తు యొక్క సృష్టి స్థితి లయలను ఒనర్చుచున్నదని ఋగ్యజుస్సామ వేదములు వచిస్తున్నాయి. కొందరు మూఢమతులు ఈ సత్యమును

నిరాకరించుటకై అనర్ధకరమైన హేయవాదనలు చేయుదురు. ఇవి అజ్ఞానులకు రమణీయములుగా గోచరిస్తాయి గాని, నిజానికి జ్ఞానులకు అసహ్యకరములు.

**కిమీహః కిఙ్కాయః సఖలు కిముపాయస్త్రిభువనం**
**కిమాధారో ధాతా సృజతి కిముపాదాన ఇతిచ |**
**అతర్క్యై శ్వర్యే త్వయ్యనవసర దుఃస్థో హతధియః**
**కుతర్కో౽యం కాంశ్చిన్ ముఖరయతి మోహాయ జగతః 5**

బ్రహ్మ ఈ ప్రపంచాన్ని సృష్టించెనా? ...అయితే ఏ కోరికతో, ఏ శరీరమును దాల్చి, ఏ సాధనా సామాగ్రి సహాయంతో, ఏ ఆధారముతో, ఏ వస్తువులతో విధాత ఈ ముల్లోకాలను సృజించాడు? మనో వాక్కులకు అతీతమైన నీ దివ్య ఐశ్వర్యమును గ్రహింపజాలక, సామాన్య జనులను మరింత మోహసాగరంలో ముంచడానికి, మూఢమతులు ఇటువంటి వ్యర్థమైన వాదాలను జరుపుతూ ఉంటారు



**అజన్మానో లోకాః కిమ వయ వవన్తో౽పి జగతాం**
**అధిష్ఠాతారం కిం భవవిధిర్ అనాదృత్య భవతి |**
**అనీశోవా కుర్యాత్ భువనజననే కఃపరికరమ్**
**యతో మన్దాస్త్వాం ప్రత్య మరవర సంశే రత ఇమే || 6 ||**

ఓ దేవదేవా! ఏదో ఒక మూలకారణం లేకుండా అవయవములతో కూడిన ఈ లోకములన్నీ ఎలా జన్మించాయి? సృష్టికర్త లేకుండా సృష్టి ఎప్పుడైనా సంభవమా? ఈశ్వరుడు తప్ప ఈ లోకాలను ఎవరు

సృజించగలరు? భగవంతుని అవసరం లేదని పలికేవారు మందమతులు, కనుకనే నీ అస్తిత్వాన్నీ వారు సందేహిస్తున్నారు.

త్రయీ సాఙ్ఖ్యం యోగః పశుపతిమతం వైష్ణవమితి
ప్రభిన్నే ప్రస్థానే పరమిదమదః పథ్యమితి చ |
రుచీనాం వైచిత్ర్యాద్ ఋజుకుటిల నానాపథజుషాం
నృణామేకో గమ్యః స్త్వమసి పయసామర్ణవ ఇవ || 7 ||

మూడువేదాలు, సాంఖ్యం, యోగం, పశుపతి మతం, వైష్ణవ మతం – ఇవన్నీ దైవ సాక్షాత్కారానికి విభిన్న మార్గాలను బోధిస్తున్నాయి. తమ తమ మనోవృత్తులను అనుసరించి భిన్న భిన్న వ్యక్తులు ఈ మార్గం మంచిది కాదని కొందరు, ఆ మార్గము శ్రేష్టమని మరికొందరు భావిస్తూ విభన్న మార్గాలను అనుసరిస్తూ ఉంటారు. సూటిగా ప్రవహించినా, వంకర టింకరగా ప్రవహించినా చిట్టచివరకు నదులన్నీ సముద్రాన్నే చేరతాయి కదా? అలాగే ఈ మార్గాలన్నీ కూడా చివరకు నిన్నే చేరుకుంటాయి, సాధకులందరికీ గమ్యం నీవే!



మహోక్షః ఖట్వాఙ్గం పరశురజినం భస్మ ఫణినః
కపాలం చేతీయత్తవ వరద తన్త్రోపకరణమ్ |
సురాస్తాం తామృద్ధిం దధతితు భవద్భ్రూ ప్రణిహితాం
న హి స్వాత్మారామం విషయమృగతృష్ణా భ్రమయతి || 8

ఒక వృషభరాజం నీ వాహనం, ఖట్వాజ్గం, గొడ్డలి నీ ఆయుధాలు, పులి చర్మం నీ ఆసనం, విభూతి నీ లేపనం, కపాలం నీ పాత్ర ఇవే గదా నీ ఆస్తుపాస్తులన్నీ! అయినా కూడా ఓ వరదా! నీ కడగంటి చూపేకదా దేవతలందరికీ మహా సుఖభోగాలను ఇస్తోంది.

ధ్రువం కశ్చిత్ సర్వం సకల మపరస్త్వ ధ్రువమిదం
పరో ధ్రౌవ్యాఽధ్రౌవ్యే జగతి గదతి వ్యస్తవిషయే |
సమస్తేఽప్యేతస్మిన్ పురమథన తైర్విస్మిత ఇవ
స్తువన్  జిహ్రేమి త్వాం న ఖలు నను ధృష్టా ముఖరతా||9

ఓ పురమథనా! ఈ సమస్త విశ్వాన్ని సాంఖ్యులు శాశ్వతమనీ, మరికొందరు, క్షణికవాదులు అశాశ్వతమనీ అంటారు. ఇతరులు నైయ్యాయికులు విభన్న లక్షణాలతో కూడిన ఈ జగత్తులో కొన్ని విషయాలు శాశ్వతమని, మరి కొన్ని అశాశ్వతమనీ పలుకుతారు. ఇటువంటి పరస్పర విరుద్ధములైన అభిప్రాయాల ఫలితంగా నా మనస్సు కలవర పడినది. అయినా కూడా నిన్ను స్తుతించడానికి నేను వెనుకాడుట లేదు, ఇదే నా ధైర్యానికి నిదర్శనం.



తవైశ్వర్యం యత్నాద్ యదుపరి విరిఞ్చిర్ హరిరధః
పరిచ్ఛేతుం యాతావనల మనలస్కన్ధ వపుషః |
తతో భక్తిశ్రద్ధా భరగురు గృణద్భ్యాం గిరిశ యత్
స్వయం తస్థే తాభ్యాం తవ కిమన్ వృత్తిర్న ఫలతి   || 10

ఓ గిరీశా! ఒకప్పుడు నీ అగ్నితేజో స్తంభరూపాన్ని చూసి, నీ మహిమను తెలుసుకోవడానికి బ్రహ్మ పైకి, విష్ణువు క్రిందకు వెళ్ళారు. కాని వాళ్ళిద్దరూ నీ ఆది-అంతాలను చేరడంలో విఫలులయ్యారు. తరువాత అత్యంత భక్తి శ్రద్ధలతో వారు నిన్ను స్తుతించినప్పుడు, వారిపై అనుగ్రహం చూపి. నీవు వారికి సాక్షాత్కరించావు. నీ పూజ ఏనాటికీ విఫలం కాదనటానికి ఇదే నిదర్శనం కదా!

అయత్నాదాసాద్య త్రిభువనమవైర్ వ్యతికరం
దశాస్యో యద్బాహూనభృత రణకణ్డూ పరవశాన్ |
శిరఃపద్మశ్రేణీ రచిత చరణామ్భోరుహ బలేః
స్థిరాయాత్ త్వద్భక్తేః త్రిపురహర విస్ఫూర్జితమిదమ్ || 11

ఓ త్రిపురనాశకా! దశముఖరావణుడు ముల్లోకాలనూ జయించి శత్రురహితుడిగా చేసుకున్నప్పటికీ, అతనికి యుద్ధకాంక్ష తీరక బాహువులను పైకెత్తి మరో యుద్ధంకోసం ఉవ్విళ్ళూరసాగాడు. అయినప్పటికీ నీపై ఇంత శివభక్తి ఉన్నది కనుకనే, తన తలలను అంత సునాయాసంగా తామర పువ్వులు అర్పించిన రీతిగా నీకు అర్పించగలిగాడు.



అముష్య త్వత్సేవా సమధిగతసారం భుజబలం
బలాత్ కైలాసేఽపి త్వదధివసతౌ విక్రమయతః |
అలభ్యా పాతాలేఽప్యలస చలితాఙ్గుష్ఠశిరసి
ప్రతిష్ఠా త్వయ్యాసీద్ ధ్రువముపచితో ముహ్యతి ఖలః || 12

నిన్ను పూజించిన రావణుడు ఎంతో బాహుబలాన్ని పొందాడు. ఆ బలాన్ని నీ ధామమైన కైలాసంపైనే ప్రయోగించడానికి పూనినప్పుడు, నీవు నీ బొటన వ్రేలితో పర్వతరాజాన్ని ఒకింత అదిమావు ఫలితంగా అతనకి పాతాళంలో కూడా స్థానం దొరకకలేదు. నిజానికి సంపన్నులైన తరువాత దుష్టులు, కృతఘ్నులై భ్రమలో పడిపోతారు.

దృద్ధిం సుత్రామ్ణో వరద పరమోచ్చైరపి
సతీమధశ్చక్రే బాణః పరిజనవిధేయత్రిభువనః |
న తచ్చిత్రం తస్మిన్ వరివసితరి త్వచ్చరణయోః
నకస్యాఉన్నత్యై భవతి శిరసత్ త్వయ్యవనతిః || 13 ||

ఓ వరదా! బాణాసురుడు ముల్లోకాలను జయించి తన స్వాధీనంలో ఉంచుకొన్నాడు. అతని మహా సంపద ఇంద్రుని ఐశ్వర్యాన్ని కూడా మించిపోయిందంటే, దానిలో ఆశ్చర్యం లేదు గదా! ఎందుకంటే. అతడు నీ పాదారాధకుడు. నీ పాదపద్మముల మ్రోల తల వంచిన వానికి మహద్భాగ్యం కల్గుట సహజమేకదా!



అకాణ్డబ్రహ్మాణ్డ క్షయచకితదేవా సురకృపా
విధేయస్యాఽఽసీద్ యస్త్రినయన విషం సంహృతవతః |
స కల్మాషః కణ్ఠే తవ న కురుతే న శ్రియమహో
వికారోఽపి శ్లాఘ్యో భువనభయ భఙ్గ వ్యసనినః || 14 ||

ఓ త్రినయనా! సముద్ర మంథన సమయంలో హఠాత్తుగా హాలాహలం పుట్టి, ఈ విశ్వమంతా నాశనం కాబోయే స్థితిని చూసి దేవాసురులు

హడలిపోయినప్పుడు వారిపై కృపా పరవశుడవైన నీవు ఆ హాలాహలాన్ని పానం చేసావు. ఫలితంగా నీ కంఠం నీలంగా మారింది. ఈ నీలకంఠం నీ సౌందర్యాన్ని  కించపరచలేకపోయింది. ఎందుకంటే, విశ్వభయాన్ని పారద్రోలే నీ వికారం కూడా శ్లాఘనీయమే  అవుతుంది.

**అసిద్ధార్థా నైవ క్వచిదపి సదేవాసురనరే**
**నివర్తన్తే నిత్యం జగతి జయినో యస్య విశిఖాః |**
**సపశ్యన్నీశ త్వామితర సురసాధారణమభూత్**
**స్మరః స్మర్తవ్యాత్మా నహి వశిషు పథ్యః పరిభవః  || 15 ||**

దేవ, అసుర,  మానవ లోకాలలో తిరుగులేనివీ సదా జయించునవీ అయిన బాణాలు గల స్మరుడు (మన్మథుడు), నిన్ను కూడా సాధారణ ఇతర దేవతలవలే భావించి నీ మీద తన బాణాలను ప్రయోగించ ప్రయత్నించాడు. ఫలితంగా ఇప్పుడు అతడు "స్మర్తవ్యుడు" (అంటే నాశనమై, జ్ఞాపకంలో మాత్రమే నిలిచిపోయిన వాడు) గానే మిగిలిపోయాడు. యోగివర్యుల పట్ల అవమానప్రదంగా ప్రవర్తించడం ఎంత గొప్పవారికైనా ఏమాత్రం శ్రేయోదాయాకం కాదు.



**మహీ పాదాఘాతాద్ వ్రజతి సహసా సంశయపదం దం**
**విష్ణోర్భ్రామ్యద్ భుజపరి ఘరుగ్ణ గ్రహగణమ్ |**
**ముహుర్ద్యౌ ర్దౌస్థ్యం యాత్యనిభృత జటాతాడి తతటా**
**జగద్రక్షాయై త్వం నటసి నను వామైవ విభుతా  || 16 ||**

జగత్తును రక్షించదానికై నీఒకసారి తాండవం చేస్తున్నావు. నీ పదాఘాతంతో తానెప్పుడు చీలిపోతానో అని భూమి దద్ధరిల్లసాగింది. నీ బాహు తాడనానికి గ్రహగణాలతో కూడిన ఆకాశం తత్తర పడసాగింది. నీ జటాజూటాలతో కొట్టబడి స్వర్గ లోకం కంపించనాగింది. అహో! అచింత్యమైన నీ మహత్వమే (జగత్తును రక్షించడానికి బదులుగా) మహా భయకారణమైనది గదా!

వియద్వ్యాపీ తారాగణ గుణిత ఫేనోద్గమరుచిః
ప్రవాహోవారాం యః పృషత లఘుదృష్టః శ్శిరసితే |
జగద్ద్వీపాకారం జలధివలయం తేన కృతమితి
అనేనై వోన్నేయం ధృతమహిమ దివ్యం తవ వపుః || 17 |



ఏ నది అయితే నక్షత్ర-గ్రహ సముహాలతో కూడిన ఆకాశాన్నంతా తెల్లని ఫేనకాంతితో వ్యాపించివేసిందో, అటువంటి మందాకినీ నది నీ జటాజూటంలో ఒక్క నీటిబొట్టుగా చిక్కుపడింది. మళ్ళీ ఆ గంగా నదియే భూలోకమంతా ప్రవహించి,ఈ లోకాన్నంతటినీ ద్వీపాకారంగా చేసివేసింది. దీనిని బట్టి నీ దివ్య శరీరం ఎంత మహోన్నతమో ఊహించనైనా లేము గదా!

రథః క్షోణీ యన్తా శతధృతి రగేన్ద్రో ధనురథో
రథాఙ్గే చన్ద్రార్కౌ రథచరణ పాణిఃశ్శర ఇతి |
దిధక్షోస్తే కోఽయం త్రిపురతృణ మాడమ్బరవిధిః
విధేయైః క్రీడన్త్యో న ఖలు పరతన్త్రాః ప్రభుధియః || 18 ||

నీఎదుట గడ్డి పోచకు సమానమైన త్రిపురాలను నాశనం చేయాలని నీవు పూనుకొన్నప్పుడు నీకు ఈ భూమి రథంగా, బ్రహ్మ సారథిగా, మేరు పర్వతం ధనుస్సుగా, సూర్యచంద్రులు రథ చక్రాలుగా, విష్ణువు బాణంగా అయ్యారు. ఈ బ్రహ్మాండమైన సామాగ్రి అంతా నీకెందుకయ్యా? సర్వ స్వతంత్రుడైన జగదీశ్వరుడు మరే ఇతర సహాయాన్ని ఆపేక్షించడు. అయినా కూడా తన ఆధీనంలో ఉన్న వస్తువులతో అతడు క్రీడించడానికి ఇష్టపడతాడు.

హరిస్తే సాహస్రం కమల బలిమాధాయ పదయోః
యదేకోనే తస్మిన్ నిజముద హరన్నేత్రకమలమ్ |
గతో భక్త్యుద్రేకః పరిణతిమసౌ చక్రవపుషా
త్రయాణాం రక్షాయై త్రిపురహర జాగర్తి జగతామ్ || 19

ఓ త్రిపురసంహారకా! ఒకప్పుడు శ్రీహరి వెయ్యి తామర పువ్వులతో నీ పాదపద్మాలను పూజింప సంకల్పించాడు. అప్పుడు ఒక పువ్వు తక్కువ కాగా వెంటనే ఆయన నేత్ర కమలాన్ని పెరికి నిన్ను అర్చించాడు. ఫలితంగా అతని ఆ మహాభక్తి కి మెచ్చి నీవిచ్చిన సుదర్శన చక్రం ముల్లోకాలనూ రక్షించడంలో నిమగ్నమైఉంది.

క్రతౌ సుప్తే జాగ్రత్ త్వమసి ఫలయోగే క్రతుమతాం
క్వ కర్మ ప్రధ్వస్తం ఫలతి పురుషారాధనమృతే |
అతస్త్వాం సమ్ప్రేక్ష్య క్రతుషు ఫలదానప్రతిభువం
శ్రుతౌ శ్రద్ధాం బద్ధ్వా దృఢపరికరః కర్మసు జనః || 20 ||

యజ్ఞం సమాప్తం అయిన తరువాత యజమానులకు ఆ యజ్ఞఫలాలను ప్రసాదించుటకు నీవు సదా జాగరూకుడవై ఉంటావు. భక్తిపూర్వకంగా భగవంతుని పూజించకుండా చేసే ఏ క్రతువులైనా సత్ఫలితాలను ఇవ్వగలవా?... ఇవ్వలేవు. కాబట్టి ఈశ్వరుడవైన నిన్ను కర్మఫల ప్రదాతవని నిశ్చయంగా తెలుసుకో గలిగినప్పుడు వేదాలపై విశ్వాసం కలిగి లోకులు కర్మలను చేయడానికి దృఢప్రయత్న శీలురవుతున్నారు.

**క్రియాదక్షో దక్షః క్రతుపతిరధీ శస్తనుభృతాం**
**ఋషీణామార్త్విజ్యం శరణద సదస్యాః సురగణాః |**
**క్రతుభ్రేషత్ స్త్వత్తః క్రతుఫల విధానవ్యసనినో**
**ధ్రువం కర్తుః శ్రద్ధావిధుర మభిచారాయహి మఖాః || 21**

హే శరణదాతా! ఏ యజ్ఞంలో ప్రజాపతి మరియూ యజ్ఞకార్యాలలో నిపుణుడూ అయిన దక్షుడే యజమానిగా, ఋషులు ఋత్విక్కులుగా, దేవతలు సభ్యులుగా ఉన్నారో అటువంటి యజ్ఞం; యజ్ఞఫలాన్ని ప్రసాదించడానికి సదా సముత్సుకుడవై ఉండే నీ చేతనే నాశనం చేయబడింది. ఎందుకంటే శ్రద్ధాభక్తి విరహితమైన యజ్ఞాలు వాటి యజమానులకు అనర్థదాయకములే అవుతాయి.

**ప్రజానాథం నాథ ప్రసభమభికం స్వాం దుహితరం**
**గతం రోహిద్భూతాం రిరమయిషు మృష్యస్య వపుషా |**
**ధనుష్పాణేర్యాతం దివమపి సపత్రాకృతమముం**
**త్రసన్తం తేఽద్యాపి త్యజతి న మృగవ్యాధరభసః || 22||**

హే నాథ! ఒకప్పుడు బ్రహ్మ కామవశుడై తన పుత్రికతోనే రమించడానికి సంకల్పించాడు. అప్పుడు ఆమె ఆడ మృగరూపాన్ని ధరించగా, బ్రహ్మ కూడా మగ మృగరూపాన్ని దాల్చి బలత్కారంగా ఆమెతో కూడాడు. అప్పుడు నీవు క్రోధం వహించి అతనిపై నీ బాణాన్ని ప్రయోగించగా అతడు భయపడి ఆకాశంలోకి పారిపోయాడు. అయినా మృగవ్యాధుని రూపంలో ధనుర్బాణాలు ధరించి క్రోధమూర్తివైన ఆనాటి నీ రూపాన్ని చూసినప్పుడు బ్రహ్మలో  పుట్టిన భయం ఈ నాటికి కూడా అతని మనస్సునుండి తొలగిపోలేదు

స్వలావణ్యాశంసా ధృతధనుషమహ్నాయ తృణవత్
పురః ప్లుష్టం దృష్ట్వా పురమథన పుష్పాయుధమపి |
యది స్త్రైణం దేవీ యమనిరతదేహార్ధఘటనాత్
అవైతి త్వామద్ధా బత వరద ముగ్ధా యువతయః  || 23

హే పురనాశకా!  హే జితేంద్రియుడా! పార్వతీ దేవి యొక్క పరమ సౌందర్యాకారం శివుని మనస్సుని ముగ్ధం చేయగలదనే విశ్వాసంతో మన్మథుడు వింటిని చేపట్టాడు. తక్షణమే అతడు దగ్ధం కావడం పార్వతీ దేవి కళ్ళారా చూసింది. అయినా కృపాపరవశుడవై నీవు ఆమెను అర్ధదేహ ధారిణిగా చేయడం చూసి, నిన్ను స్త్రీ వశ్యుడవని భావిస్తే  అది అమాయకత్వమే కదా!

శ్మశానేష్వాక్రీడా స్మరహర పిశాచాః సహచరాః
చితాభస్మాలేపః స్రగపి నృక రోటీపరికరః |

అమఙ్గల్యం శీలం తవ భవతు నామైవమఖిలం
తథాపి స్మర్తౄణాం వరద పరమం మఙ్గళమసి || 24 ||

హే మన్మథనాశకా! శ్మశానం నీ క్రీడాభూమి, పిశాచాలు నీ సహచరులు, చితా భస్మం నీకు గంధలేపనం, కపాలాలు నీకు మాలలు – ఇలా నీ వ్యవహారమంతా అమంగళకరమే. అయినా కూడా ఓ వరదా! నిన్ను స్మరించే వారి పాలిట నీవు సర్వమంగళ ప్రదుదవు కావడం ఎంత విచిత్రమైన విషయం కదా!

మనః ప్రత్యక్చిత్తే సవిధమవిధా యాత్తమరుతః
ప్రహృష్యద్రోమాణః ప్రమద సలిలోత్సఙ్గితి దృశః |
యదాలోక్యాహ్లాదం హ్రద ఇవ నిమజ్యామృతమయే
దధత్యన్త స్తత్త్వం కిమపి యమినస్తత్ కిల భవాన్ || 25

యోగి వర్యులు శాస్త్రానునారం యమ నియమాలను పాటించి ప్రాణాయామాదుల సహాయంతో మనస్సును ప్రత్యగాత్మతో ఏకీకృతం చేసి పులకిత శరీరులై ఆనందాపూర్ణ నేత్రాలతో ఏ అంతర్నిహిత అనిర్వచనీయమైన తత్వాన్ని దర్శిస్తూ అమృత సాగరంలో ఓలలాడుతూ ఆనందమృతాన్ని గ్రోలుతూ ఉంటారో ఆ అమృతానంద పరతత్వం నీవే సుమా!

త్వమర్కస్త్వం సోమస్త్వమసి పవనస్త్వం హుతవహః
త్వమాపస్త్వం వ్యోమ త్వము ధరణిరాత్మా త్వమితి చ |
పరిచ్ఛిన్నామేవం త్వయి పరిణతా బిభ్రతి గిరం

న విద్మస్తత్  తత్వం వయమిహ తు యత్ త్వం న భవసి  ||
26 ||

నీవు సూర్యుడవు, చంద్రుడవు, పవనుడువు, అగ్నివి, ఆకాశానివి, పృథ్వీ జలాలవు, ఆత్మవు ఆన్నీ నీవే – అని విద్వాంసులు ప్రకటిస్తూ ఉంటారు. ఇవన్నీ నిన్ను గురించిన అపరిపూర్ణమైన ప్రకటనలే! ఎందుకంటే నిజానికి సర్వమూ నీవే కాబట్టీ  ఏ తత్త్వం నీవు కాదో మాకు తెలియదు.

త్రయీం తిస్రోవృత్తీః త్రిభువనమథో త్రీనపి సురాన్
అకారాద్యైర్ వర్ణైస్త్రిభి రభిదధత్ తీర్ణవికృతి |
తురీయంతే ధామ ధ్వనిభిర వరున్ధాన మణుభిః
సమస్తం వ్యస్తం త్వాం శరణద! గృణాత్యోమ్ ఇతిపదమ్ ||27

హే శరణదా! "ఓమ్" అనే పదంలో అ –ఉ –మ అనే మూడు అక్షరాలు ఉన్నాయి. "అకారం" బుగ్వేదాన్ని, జాగ్రదావస్థను, భూలోకాన్ని బ్రహ్మను ప్రతిపాదిస్తున్నది. "ఉకారం" యజుర్వేదాన్ని స్వప్నావస్థను, భువర్లోకాన్ని, విష్ణువును ప్రతిపాదిస్తోంది. "మకారం" సామవేదాన్ని, సుషుప్తావస్థను, మహేశ్వరుణ్ణి ప్రతిపాదిస్తోంది. అటువంట ఓంకారము యొక్క  సూక్ష్మ ధ్వని సర్వ వికారాలకు అతీత మైన నీ తురీయావస్థను ప్రతిపాదిస్తోంది. ఈ విధంగా ఓంకారము ఏకానేకుడవైన నిన్నే స్తుతిస్తోంది.

భవః శర్వో రుద్రః పశుపతిరథోగ్రః సహమహాన్

తథా భీమేశానావితి యదభిధానాష్టకమిదమ్ |
అముష్మిన్ ప్రత్యేకం ప్రవిచరతి దేవ శ్రుతిరపి
ప్రియాయాస్మైధామ్నే ప్రవిహిత నమస్యోఽస్మి భవతే || 28

ఓ దేవదేవా! భవుడు, శర్వుడు, రుద్రుడు, పశుపతి, ఉగ్రుడు, మహాదేవుడు, భీముడు ఎనిమిదీ కూడా నీ నామాలే. వీటిలో ప్రతీ ఒక్క పేరులోని అర్థాన్ని ప్రకాశింపజేయడానికి సమగ్ర వేదం సదా ప్రయత్నం చేస్తూ ఉంది, కాని సఫలం కావడం లేదు. కాబట్టి పరమానంద రూపుడవు, అఖండ చైతన్య స్వరూపుడవు అయిన నీకు నేను నా మనోవాక్కాయాల ద్వారా నమస్కరిస్తున్నాను.



నమో నేదిష్ఠాయ ప్రియదవ దవిష్ఠాయ చ నమో
నమః క్షోదిష్ఠాయ స్మరహర మహిష్ఠాయ చ నమః |
నమో వర్షిష్ఠాయ త్రినయన యవిష్ఠాయ చ నమో
నమః సర్వస్మై తే తదిదమతి సర్వాయచ నమః || 29 ||

హే సంసారదుఃఖ నాశకా! భక్తులకు అత్యంత సమీపస్థుడవైన నీకు నా నమస్కారములు. భక్తి లేని వారికి అత్యంత దూరుడవైన నీకు నా నమస్కారములు. హే స్మరాహరా! సూక్ష్మాతిసూక్ష్ముడవైన నీకు నా నమస్కారము, అలాగే స్థూలా తిస్థూలుడవైన నీకు నా నమస్కారము. ఓ త్రినయనా! అత్యంత వృద్ధుడవైన నీకు నా నమస్కారము; అత్యంత తరుణుడవైన నీకు నా నమస్కారము. ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని

అన్ని రూపాలలోను వర్తమానుడవైన నీకు నా నమస్కారము. మరియు సర్వాతీతుడవై విలసిల్లే నీకు నా అసంఖ్యాక నమస్కారములు.

**బహులరజసే విశ్వోత్పత్తౌ భవాయ నమో నమః**
**ప్రబలతమసే తత్ సంహారే హరాయ నమో నమః |**
**జనసుఖకృతే సత్త్వోద్రిక్తౌ మృడాయ నమో నమః**
**ప్రమహసి పదే నిస్త్రైగుణ్యే శివాయ నమో నమః || 30 ||**

విశ్వాన్ని సృష్టించడానికి బహు రజోగుణంతో బ్రహ్మగా వ్యక్తమౌతున్న నీకు నా నమస్కారం. అలాగే విశ్వ సంహారార్థం అత్యంత తమో గుణంతో మహేశ్వర రూపుడవుగా వ్యక్తమౌతున్న నీకు నా నమస్కారము. లోకపాలనార్థం ప్రబల సత్వ గుణంలో విష్ణువుగా ప్రకటితమౌతున్న నీకు నా నమస్కారము. మరియు త్రిగుణాలకు అతీతుడవై, సర్వ మంగళప్రదాతుడవై, పరమపద ప్రదాతవు అయిన నీకు నా శత నమస్కారములు.



**కృశపరిణతిచేతః క్లేశవశ్యం క్వ చేదం**
**క్వ చ తవ గుణసీమోల్లఙ్ఘినీ శశ్వదృద్ధిః |**
**ఇతి చకితమమన్దీకృత్య మాం భక్తిరాధాత్**
**వరద చరణయోస్తే వాక్యపుష్పోపహారమ్ || 31 ||**

హే వరప్రదాతా! క్లేశ సమూహములతో క్లిష్టుడనైన ఈ నా అల్పబుద్ధి ఎక్కడ? అపరమిత మహామాతిశయమైన నీ నిత్య విభూతి ఎక్కడ? ఈ భావనతో భయగ్రస్తుడైన నన్ను నీ పట్ల నాకున్న భక్తి నిర్భయుణ్ణి చేసి ఈ స్తోత్రపుష్పాంజలిని నీ పాదపద్మాలకు సమమర్పింప చేసింది

అసిత గిరి సమం స్యాత్ కజ్జలం సిన్ధుపాత్రే |
సుర తరువర శాఖా లేఖనీ పత్రముర్వీ |
లిఖతి యది గృహీత్వా శారదా సర్వకాలం
తదపి తవ గుణానామ్ ఈశపారం నయాతి || 32 ||

నీల పర్వతం సిరా గా, సముద్రం సిరాబుడ్డీ గా; పారిజాత వృక్షపు శ్రేష్ట శాఖ కలంగా మరియూ భూమి కాగితంగా ఈ సామాగ్రులన్నింటినీ తీసుకొని స్వయంగా సరస్వతీ దేవి చిరకాలం వ్రాసినా కూడా, ఓ మహాదేవా! నీ గుణాల అంతాన్ని చేరజాలదు., అంటే నీ గుణగణాలను పూర్తిగా కీర్తించనేరదు అనీ భావము



## ఫలస్తుతి

అసురసుర మునీన్ద్రైరర్చిత స్యేన్దుమౌళేః
గ్రథితగుణ మహిమ్నో నిర్గుణ స్యేశ్వరస్య |
సకలగుణవరిష్ఠః పుష్పదన్తాభిధానో
రుచిరమ్ అలఘువృత్తైః స్తోత్రమేతత్ చకార || 33 ||

ఓ చంద్రశేఖరా! దేవతలు, అసురులు, మునులు – వీరిలో శ్రేష్టతమ వ్యక్తులు నీ గుణాతిశయాన్ని చూసి సదా నిన్ను అర్చిస్తున్నారు. మరియు వేదాలన్నీ నీ గుణాలను ప్రకటించడానికి సదా ప్రయత్నిస్తున్నాయి. నీవు

నిర్గుణ స్వరూపుడవు, అటువంటి నీ పట్ల పుష్పదంతుదనే గంధర్వుని ద్వారా, దీర్ఘ ఛందస్సులో ఈ  మనోహరస్తవం రచింపబడింది.

**అహ రహ రన వద్యం ధూర్జటేః స్తోత్రమేతత్ పఠతి**
**పరమభక్త్యా శుద్ధచిత్తః పుమాన్ యః |**
**స భవతి శివలోకే రుద్రతుల్యస్తథాఽత్ర**
**ప్రచురత రధనాయుః పుత్రవాన్ కీర్తిమాంశ్చ  || 34 ||**

ఎవరు అయితే ఈ పవిత్ర స్తోత్రాన్ని ప్రతిదినం భక్తితో పఠిస్తారో అతడు ఈ లోకంలో శ్రీమంతుడు, దీర్ఘాయువు, పుత్రవంతుడు, యశస్వంతుడూ అవుతాడు. మరణించిన తరువాత శివలోకంలో రుద్ర తుల్యుడౌతాడు



**మహేశాన్నాపరోదేవో మహిమ్నోనాపరాస్తుతిః |**
**అఘోరాన్నాపరోమన్త్రో నాస్తితత్త్వంగురోఃపరమ్  || 35 ||**

శివునితో సమానమైన దేవుడు లేడు. మహిమ్న స్తోత్రం కంటే శ్రేష్ఠమైన స్తోత్రం లేదు. అఘోరమంత్రం కంటే మంత్రం లేదు. గురువుకంటే శ్రేష్ఠమైన తత్వం మరొకటి లేదు

**దీక్షా దానం తపస్తీర్థం జ్ఞానం యాగాదికాః క్రియాః**
**మహిమ్నస్తవ పాఠస్య కలాం నార్హన్తి షోడశీమ్  || 36 ||**

మంత్ర దీక్ష, దానం, తపం, తీర్థయాత్రలు, శాస్త్ర జ్ఞానం, యాగాది క్రియలు, ఇవన్నీ మహిమ్నః స్తోత్రం యొక్క పదహారవ భాగంతో కూడా సమానం కాజాలవు.

కుసుమదశ ననామా సర్వగన్ధర్వరాజః
శిశుశశిధర వరమౌళే ర్దేవదేవస్య దాసః |
సఖలు నిజమహిమ్నో భ్రష్ట ఏవాస్య రోషాత్
స్తవనమిద మకార్షీద్ దివ్యదివ్యం మహిమ్నః || 37 ||

బాలచంద్రుని తలపై ధరించిన మహాదేవుని దాసుడు, పుష్పదంతుడనే ప్రసిద్ధ గంధర్వ రాజు శివుని కోపానికి గురియై మహిమావంతమైన తన స్థానం నుండి పతితుడై ,మళ్ళీ శివ ప్రీతి మనస్కుడై, మనోహరమైన ఈ మహిమ్నః స్తోత్రాన్ని రచించాడు. 22

సురవరమునిపూజ్యం స్వర్గమోక్షైకహేతుం
పఠతి యది మనుష్యః ప్రాఞ్జలి ర్నాన్యచేతాః |
వ్రజతి శివసమీపం కిన్నరైః స్తూయమానం
స్తవనమిదమమోఘం పుష్పదన్తప్రణీతమ్ || 38 ||

సుర శ్రేష్టులచే, మునులచే పూజింపబడునది; పుష్పదంతునిచే రచింపబడినది; స్వర్గ ప్రాప్తికి, మోక్షమునకు హేతువైన ...ఈ స్తోత్రాన్ని బద్ధాంజలుడై, ఏకాగ్ర చిత్తంతో పఠించేవాడు కిన్నెర గణాలతో స్తుతింపబడిన వాడై శివ సామీప్యతను పొందుతాడు.

ఆసమాప్తమిదం స్తోత్రం పుణ్యం గన్ధర్వభాషితమ్ |
అనౌపమ్యం మనోహారి సర్వమీశ్వరవర్ణనమ్ || 39 ||

గంధర్వ రచితమైన ఈ స్తోత్రం ఆద్యంతమూ పవిత్రకరమూ, అసదృశమూ, మనోహరమూ, మంగళ ప్రదమూ, ఈశ్వరమహిమా వర్ణనతో పరిపూర్ణమూ అయి ఉన్నది.

ఇత్యేషా వాఙ్మయీ పూజా శ్రీమచ్ఛఙ్కరపాదయోః |
అర్పితా తేన దేవేశః ప్రీయతాం మే సదాశివః || 40 ||

ఈ విధంగా స్తోత్రరూపపు నా పూజ శివపాదాలమ్రోల సమర్పింపబడినది. దీనితో శివుడు నా ఎడ సంతుష్టుడగు గాక!



తవ తత్త్వం నజానామి కీదృశోఽసి మహేశ్వర |
యాదృశోఽసి మహాదేవ తాదృశాయ నమోనమః || 41

ఓ మహేశ్వరా! నీ తత్త్వము ఎటువంటిదో నేను ఎఱుగను. నీవు ఎటువంటి స్వరూపుడవో, అటువంటి నీకు (ఆ స్వరూపానికి) నా నమస్కారములు.

ఏకకాలం ద్వికాలం వా త్రికాలం యః పఠేన్నరః |
సర్వపాపవినిర్ముక్తః శివ లోకే మహీయతే || 42 ||

ఎవరైతే ఈ స్తోత్రాన్ని ఒక్కసారి గాని, రెండుసార్లు గాని, లేదా మూడుసార్లు గాని పఠిస్తారో, అతడు సర్వపాపముల నుండి విముక్తుడై శివలోకములో గౌరవింపబడతాడు.

## శ్రీ పుష్పదన్తముఖపఙ్కజ నిర్గతేన
## స్తోత్రేణ కిల్బిషహరేణ హరప్రియేణ |
## కణ్ఠస్థితేన పఠితేన సమాహితేన
## సుప్రీణితో భవతి భూతపతిర్మహేశః ||43 ||

శ్రీ పుష్పదంతుని ముఖపద్మం నుండి వెలువడిన ఈ స్తోత్రం పాప నాశకం. పరమ శివునకు అత్యంత ప్రీతికరమైనది కాబట్టి దీనిని కంఠస్థం చేసినా, పఠించినా, పూజించినా... మహాదేవుడు అత్యంత ప్రీతిపూర్ణుడవుతాడు.



## || ఇతి శ్రీ పుష్పదంతాచార్య విరచితం శివమహిమ్నః స్తోత్రం సంపూర్ణమ్||